## క్లుప్తంగా

### వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

**ఉదయగిరి రూరల్:** కొండాయపాళెం పంచాయతీ పరిధిలోని వెంకట్రావుపల్లెలోని కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి సంప్రదాయబద్ధంగా కల్యాణాన్ని జరిపారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### రేషన్‌డీలర్ల కాటాల తనిఖీ



**ఆత్మకూరురూరల్:** మండలంలోని రేషన్‌డీలర్లకు చెందిన కాటాలను తూనికలు, కొలతల శాఖ అధికారులు శనివారం తనిఖీ చేశారు. మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద కాటాలు సక్రమంగా ఉన్నాయా..లేదా అని పరిశీలించి లేని వాటిని సరిచేశారు.

### నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలి



**ఆత్మకూరురూరల్:** పంచాయతీరాజ్ అతిథిగృహ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని నెల్లూరుకు చెందిన క్వాలిటీ కంట్రోల్ డీఈ రామకృష్ణ సూచించారు. ఆత్మకూరులో చేపడుతున్న పంచాయతీరాజ్‌శాఖ అతిథి గృహ నిర్మాణ పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు శనివారం పరిశీలించారు. నాణ్యతపై కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు. వారి వెంట పీఆర్ ఏఈ ఖాదర్‌మస్తాన్ ఉన్నారు.

### మేకపాటికి సన్మానం



**ఉదయగిరి:** అప్పసముద్రంలో శనివారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పలకా సుబ్బారెడ్డి కుమారుడి వివాహ నలుగు కార్యక్రమానికి ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేకపాటిని సుబ్బారెడ్డి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట జెడ్పీటీసీ మోది రామాంజనేయులు, స్థానిక నాయకులు ఉన్నారు.

### న్యాయ విజ్ఞాన సదస్సు



**కావలి (అల్లూరు):** కావలిలోని సబ్‌జైలులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల లీగల్ ఎయిడ్ మెంబర్ ఐ సాయిప్రసాద్ మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తనతో నడుచుకుంటే శిక్ష కాలం తగ్గుతుందన్నారు. ఖైదీలు చెడు అలవాట్లు, వ్యసనాలను మానుకుని ప్రభుత్వం కల్పించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఎల్ సీహెచ్ అశోక్, జైలు సూపరింటెండెంట్ చినసుబ్బయ్య, జైలు సిబ్బంది, పాల్గొన్నారు.

### సైబర్ మాయగాళ్ల వలలో కావలి ఎమ్మెల్యే

**కావలి (అల్లూరు):** కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సైబర్ మాయగాళ్ల వలలో చిక్కుకున్నారు. గత నెల 22వ తేదీన ఆర్టీఏ బకాయిలు చెల్లించాలని ఎమ్మెల్యే వ్యక్తిగత సెల్‌ఫోన్ నంబరుకు సైబర్ నేరగాళ్లు ఒక లింక్‌ను పంపారు. ఆయన ఆ లింక్‌ను క్లిక్ చేయగానే సిమ్ బ్లాక్ అయింది. దీంతో ఆయన హైదరాబాద్‌లోని ఆధార్ విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేశారు. 25 రోజుల తరువాత సిమ్ యాక్టివేట్ అయింది. గత నెల 25వ తేదీ నుంచి ఈ నెల 16వ తేదీ వరకు రెండు యాక్సిస్ బ్యాంక్ ఖాతాల నుంచి యూపీఐ ద్వారా రూ. 23,16,009 నగదు మాయమైనట్లు గుర్తించారు. కావలి పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.

### పెళ్లి చేసుకుంటానని మోసం.. మహిళ నిరసన

**వింజమూరు(ఉదయగిరి):** ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేయడంతో ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలు నిరసనకు దిగిన ఘటన సాతానువారిపాళెంలో శనివారం చోటు చేసుకుంది.బాధితురాలి కథనం మేరకు ..సాతానువారిపాళేనికి చెందిన పరుచూరి హరేంద్రతో ఉదయగిరి ప్రాంతానికి చెందిన రేష్మకు నెల్లూరులో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని హరేంద్ర మోసం చేయడంతో బాధితురాలు మూడు నెలల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పట్టించుకోకపోవడంతో హరేంద్ర ఇంటి ముందు నిరసనకు దిగింది.

# వర్షం పడితే నరకమే

- సోమశిల–ఉప్పలపాడు నడుమ అధ్వానంగా రోడ్డు
- ఇసుక టిప్పర్ల దెబ్బకు రూపురేఖలు కోల్పోయిన రహదారి
- చినుకు పడితే చెరువును తలపిస్తున్న వైనం
- గుంతలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్ర వాహనదారులు
- రోడ్డు దుస్థితిని పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



ఇటీవల కురిసిన వర్షానికి సోమశిల - ఉప్పలపాడు నడుమ బురదమయంగా ఆత్మకూరు రోడ్డు

**సోమశిల :** అనంతసాగరం మండలంలోని సోమశిల–ఉప్పలపాడు నడుమ రోడ్డు అధ్వానంగా తయారైంది. భారీ గుంతలతో వర్షం పడితే చెరువును తలపిస్తోంది. భారీ గుంతలు కనిపించకపోతుండడంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు నరకాన్ని చవిచూస్తున్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లను అద్దంలా తీర్చిదిద్దుతామని ఊదరగొట్టారు. 15 నెలలుగా రోడ్డు అధ్వానంగా ఉన్నా పట్టించుకోకపోవడంపై వాహనచోదకుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పట్టించుకోని మంత్రి ఆనం**

ఉప్పలపాడు చెరువు వద్ద నుంచి సోమశిల వరకు సుమారు 7.5కిలోమీటర్ల దూరం రహదారి పూర్తిగా దెబ్బతింది. పడమటికంభంపాడు ఇసుకరీచ్ నుంచి ఇసుకను తరలించే టిప్పర్ల కారణంగా పూర్తిగా రూపురేఖలు కోల్పోయి భారీ గుంతలు ఏర్పడ్డాయి. వర్షం పడితే గుంతల్లో నీరు చేరి చెరువును తలపిస్తోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు, కారులు, ఆటోల్లో వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆత్మకూరు–సోమశిల రహదారిలో ఉప్పలపాడు నుంచి సోమశిల వరకు రోడ్డు అధ్వానంగా ఉంటే కనీసం ఒక్కసారి కూడా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆత్మకూరు మీదుగా రాకుండా రాజుపాళెం మీదుగా సోమశిలకు వచ్చి వెళ్తూ రోడ్డు దుస్థితిని పట్టించుకోకపోవడంపై వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గుంతలతో నిదానంగా వెళ్తున్న బస్సు



కమ్మవారిపల్లి కలుజు వద్ద దెబ్బతిన్న రోడ్డు

#### ఇబ్బందులు పడుతున్నాం



సోమశిల నుంచి ఉప్పలపాడు వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో ఆత్మకూరుకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షం పడితే చెరువులా మారి గుంతలతో కనిపించపోతుండడంతో ప్రమాదాల పాలవుతున్నాం.

– సిద్ధన పెంచలరెడ్డి, సోమశిల

#### రోడ్డును బాగుచేయాలి



సోమశిల– ఉప్పలపాడు నడుమ రోడ్డు పూర్తిగా రూపురేఖలు కోల్పోయింది. ఇసుక టిప్పర్లతో భారీ గుంతలు ఏర్పడడంతో రాకపోకలు సాగించేందుకు నరకాన్ని చవిచూస్తున్నాం. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రోడ్లను అద్దంలా తీర్చిదిద్దుతామని ఊదరగొట్టిన నాయకులు రోడ్డు దుస్థితిని గమనించి బాగు చేయాలి.

–ముక్కు మస్తాన్‌గౌడ్, సోమశిల

#### అధ్వానంగా రెండు రోడ్లు



సోమశిల నుంచి నెల్లూరు, ఆత్మకూరుకు వెళ్లే రెండు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. సోమశిల ప్రాజెక్ట్ మీదుగా నెల్లూరు మార్గంలో పరమానందయ్య ఆశ్రమం వద్ద బ్రిడ్జి కొట్టుకుపోవడంతో డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేయడంతో రాకపోకలు కష్టంగా మారాయి. ఆత్మకూరు మార్గంలో సోమశిల నుంచి ఉప్పలపాడు వరకు రోడ్డు అధ్వానంగా తయారవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సోమశిలకు పర్యాటకుల రాకపోకలు సైతం తగ్గాయి.

– జీ వెంకటరమణ, సోమశిల

# గిరిజనులకు అన్నదానం

**కావలి (అల్లూరు):** కావలిలోని 5వ వార్డు పరిధిలోని కాలేరిగుంట గిరిజన కాలనీలో విజయ భారత్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేశారు. పట్టణానికి అలహరి వెంకటేశ్వర్లు, రాధికదేవి దంపతుల కుమార్తె డాక్టర్ శశిమేఘన జన్మదినాన్ని పురస్కరించుకుని గిరిజనులకు అన్నదానం చేశారు. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు షేక్ బాషా, రాయపాటి దిలీప్‌కుమార్, తోట వెంకటేశ్వర్లు, నందిపాటి రమేష్, జమీర్, హరనాథ్, రాంప్రసాద్, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.



### మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు

**వింజమూరు(ఉదయగిరి):** వింజమూరు మండల సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కే శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై చర్చించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

### కిలో పొగాకు గరిష్ట ధర రూ.340

**మర్రిపాడు:** డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.340 లభించింది. వేలానికి 1020 బేళ్లు రాగా, 744 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.340, కనిష్టంగా రూ.83, సగటున రూ.179.85 ధర పలికిందని వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

**కలిగిరి:** స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.340 లభించింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 888 బేళ్లను తీసుకురాగా, 779 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.340, కనిష్టంగా రూ.84, సరాసరిన రూ.249.58 ధర పలికిందని వేలం కేంద్రం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

## సోషల్‌ఆడిట్ బృందాల తనిఖీలు ప్రారంభం

**వింజమూరు(ఉదయగిరి):** వింజమూరు మండలంలో సోషల్ ఆడిట్ బృందాల తనిఖీలు శనివారం నుంచి ప్రారంభమైనట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ చేసి గుర్తించిన అంశాలను గ్రామసభల్లో వెల్లడిస్తారని చెప్పారు. ఈ నెల 30న రావిపాడు, వచ్చే నెల 1న ఊటుకూరు, నల్లగొండ్ల, గుండెమడకల, 3న బుక్కాపురం, 4న కాటేపల్లి, 7న ఏ కిస్టీపురం, చాకలికొండ, శంఖవరం, నందిగుంట, 8న జనార్దనపురం పంచాయతీల్లో గ్రామసభలు జరుగుతాయని తెలిపారు. అనంతరం మండలస్థాయిలో ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించి అవకతవకలపై విచారణ జరుపనున్నట్లు వివరించారు.

## రైతులకు అందుబాటులో యూరియా

**ఉదయగిరి రూరల్:** మండలంలోని గుడినరవ రైతు సేవా కేంద్రంలో 18 టన్నుల(400 బస్తాలు) యూరియా రైతులకు అందుబాటులో ఉందని ఏఓ విజయభాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి రైతులకు పంపిణీ చేస్తామని చెప్పారు. గుడినరవ, వెంగళరావునగర్, గండిపాళెం, అప్పసముద్రం రైతులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకం లేదా వన్‌బీ, ఆధార్ కార్డుతో వస్తే అందజేస్తామని తెలిపారు.

## 3వ తేదీ నుంచి మూడో విడత భూసర్వే

**ఆత్మకూరురూరల్:** ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో అక్టోబర్ 3వ తేదీ నుంచి మూడో విడత భూసర్వే చేపట్టనున్నట్లు ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని తెలిపారు. శనివారం ఆమె తన కార్యాలయంలో డివిజన్ పరిధిలోని మండలాల సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. భూసర్వేతో పాటు గ్రామ పంచాయతీల వారీగా చేపట్టనున్న స్వామిత్వ సర్వేపై అవగాహన కల్పించారు. అనంతసాగరం మండలం వరికుంటపాడు, అనుమసముద్రంపేట మండలం కొండమీదకొండూరు, ఆత్మకూరు మండలం బొటికర్లపాడు, జంగాలపల్లి, చేజర్ల మండలం చిత్తలూరు, కలువాయి మండలం నూతనపల్లి, మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లి, నాగరాజుపాడు, సంగం మండలం నీలాయపాళెం, సీతారామపురం మండలం దేవమ్మ చెరువు, ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామాలను మూడో విడత భూసర్వేకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో సర్వేను ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



సర్వేయర్లతో మాట్లాడుతున్న ఆర్డీఓ పావని

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**సంగం :** స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సోమ్లానాయక్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసులుయాదవ్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు పట్టాభిరామిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, సొసైటీ సీఈఓ దస్తగిరి, సాగునీటి సంఘ అధ్యక్షులు షేక్ బాబు, గునుపూడి గిరిబాబు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న తహసీల్దార్

## సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**సీతారామపురం :** మారంరెడ్డిపల్లి సొసైటీ ద్వారా అందించే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్ కోరారు. సొసైటీ కార్యాలయంలో శనివారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా సొసైటీలో 300 బస్తాల నానో యూరియా అందుబాటులో ఉంచామని, సోమవారం నుంచి రైతులకు అందజేస్తామని తెలిపారు. రైతులకు పంట రుణాలను మంజూరు చేస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.



# కారును ఢీకొన్న మినీలారీ

- సురక్షితంగా బయటపడిన కారులోని ప్రయాణికులు

**సంగం:** మినీలారీ వెనుకగా ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జు కాగా అందులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన సంగం కొండపై నెల్లూరు– ముంబయి జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. వివరాలు..మండలంలోని పెరమనకు చెందిన కందిబోయిన సురేష్ వరికోత మెషీన్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. సంగంలో వరికోత కోసేందుకు మెషీన్‌ను మినీలారీలో తీసుకుని బయలుదేరాడు. అలాగే తెలంగాణ రాష్ట్రానికి చెందిన సదానందం, బ్రహ్మం, ప్రభాకర్ కారులో కర్నూలు మీదుగా నెల్లూరుకు శుక్రవారం బయలుదేరారు. శనివారం సంగం కొండ దిగే క్రమంలో రోడ్డుకు ఎడమవైపున లారీ టైరు పంక్చర్ అయి ఆగి ఉండడం..ముందు వెళ్తున్న వాహనం నిధానంగా పోతుండడంతో కారును కొద్దిగా ఆపారు. అదే సమయంలో వెనుకగా వేగంగా వస్తున్న వరికోత మెషీన్ లారీ అదుపుతప్పి కారును ఢీకొంది. దీంతో కారు పూర్తిగా వెనక్కు తిరిగి లారీలో ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో కారు వెనుక భాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. సమాచారం అందుకున్న సంగం హెడ్‌కానిస్టేబుల్ శిఖామణి పోలీసు సిబ్బందితో వచ్చి లారీలోని వరికోత మెషీన్‌ను కిందకు దింపి జేసీబీ సాయంతో కారు, లారీని పక్కకు తీసి సంగం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కారులోని ముగ్గురు ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. వరికోత మెషీన్ సైడుకు ఒరిగి కారుపై పడి ఉంటే ప్రాణనష్టం జరిగి ఉండేదని ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేశారు. కాగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారును పక్కకు తీస్తున్న దృశ్యం

### మాముడూరు విద్యార్థుల సత్తా



**సోమశిల:** చేజర్ల మండలం మాముడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో సత్తాచాటారని వ్యాయామ ఉపాధ్యాయుడు గురవయ్య శనివారం తెలిపారు. ఈ నెల 25, 26 తేదీల్లో కర్నూలులో జరిగిన పోటీల్లో నెల్లూరు జిల్లా బాల,బాలికల జట్లు విజేతలుగా నిలిచి బంగారు పతకాలను అందుకున్నాయని చెప్పారు. బాలికల జట్టు విజయంలో మాముడూరుకు చెందిన ఎం ప్రణీత, పీ పల్లవి కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

### ఎయిడ్స్‌పై అవగాహన



**ఆత్మకూరురూరల్:** మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై శనివారం అవగాహన కల్పించారు. సార్డ్స్ ప్రతినిధులు మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఎయిడ్స్ వ్యాప్తి, నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సార్డ్స్ సిబ్బంది సుస్మిత, సునంద, కవిత, నూర్జహన్, సుగుణ, ఉమ, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులోని కాశీనాయన ఆశ్రమంలో దుర్గాదేవి అలంకారం



ఆత్మకూరులోని ఉత్తరబలిజవీధిలో లలితాదేవిగా జ్వాలాముఖి



ఆత్మకూరులో మహాలక్ష్మీదేవిగా అన్నపూర్ణాదేవి



సంగం: సంతానలక్ష్మిగా కామాక్షిదేవి



కలిగిరి: మహాలక్ష్మీదేవిగా భద్రకాళి



ఉదయగిరి: లలితాత్రిపుర సుందరీగా సంతానలక్ష్మి



ఉదయగిరిలో లలితాత్రిపురసుందరిగా పార్వతీదేవి

# జయహే దుర్గాదేవి

**ఆత్మకూరురూరల్:** పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆరో రోజు శనివారం అమ్మవారు విశేషాలంకారాల్లో భక్తులను అనుగ్రహించారు. కాశీనాయన ఆశ్రమంలో దుర్గాదేవి అర్ధనారీశ్వర అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు. ఉత్తరబలిజవీధిలో జ్వాలాముఖి అమ్మవారు లలితాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో మహాలక్ష్మీదేవిగా అన్నపూర్ణాదేవి భక్తులను కటాక్షించారు.

**వరికుంటపాడు::** తూర్పురొంపిదొడ్లలోని మానసాదేవి ఆలయంలో కాత్యాయనీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు.

**సీతారామపురం :** ప్రముఖ పుణ్యక్షేత్రం సిద్ధేశ్వరంలో కాత్యాయనీదేవి అలంకారంలో ఇష్టకామేశ్వరీదేవి భక్తులకు దర్శనమిచ్చారు. సీతారామపురం మెయిన్ బజార్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. బెస్త కాలనీలో గ్రామదేవత అంకాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఉదయగిరి :** పట్టణంలోని పార్వతి పరమేశ్వర ఆలయం, సంతానలక్ష్మి ఆలయం, గండిపాళెంలోని నాగరప్పమ్మ ఆలయాల్లో అమ్మవారు లలితాత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

**కలిగిరి:** తెల్లపాడులోని భద్రకాళి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**సంగం:** స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలో సంతానలక్ష్మి అలంకారంలో కామాక్షిదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.



సీతారామపురం: కాత్యాయనీదేవిగా ఇష్టకామేశ్వరీదేవి



వరికుంటపాడు: కాత్యాయనీదేవిగా మానసాదేవి